శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## మాలేపాటి సుబ్బానాయుడు ఆకస్మిక మృతిపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దిగ్భ్రాంతి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త** టీడీపీ సీనియర్ నాయకులు, ఆప్తులు, పార్టీకి విశేష సేవలు అందించిన ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆకస్మిక మృతి తీరని లోటని, ఆయన హఠాన్మరణం బాధాకరమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంచి మనిషిగా, తెలుగుదేశం పార్టీ దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి సుబ్బానాయుడు అందించిన సేవలు మరువలేనివని, ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, బాధాకర సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఆ దేవుడు ఆత్మదైర్యం ఇవ్వాలని కోరారు.

## టిడిపి సీనియర్ నేత మాలెపాటి సుబ్బనాయుడు మృతికి సంతాపం వ్యక్తం
### చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు విద్య,అక్టోబర్ 21,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టి రాష్ట ఉపాధ్యక్షులు ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బనాయుడు మృతిపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.కావలి నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి సుబ్బనాయుడు ఎంతో కృషి చేశారన్నారు. నిబద్ధత, అంకితభావం కలిగిన నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు పేర్కొన్నారు. దివంగత సుబ్బనాయుడు కుటుంబ సభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుబ్బానాయుడు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

## 24న డిప్యూటీ స్పీకర్ కె. రఘురామకృష్ణ రాజు జిల్లాకు రాక
### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 21, ప్రభాతవార్త** 24న డిప్యూటీ స్పీకర్ కె. రఘురామకృష్ణ రాజు జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం తిరుమల నుండి ఉదయం 8.00 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి నెల్లూరు కనుపర్తిపాడులో ఉన్న వి పి ఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు ఉదయం 10.30 గంటలకు చేరుకుంటారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు బయలుదేరి తాడేపల్లికు చేరుకుంటారని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## ఎడతెరపిలేని వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని
### - మేయర్ స్రవంతిజయవర్ధన్ విజ్ఞప్తి



**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 21,ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో నీటి ప్రవాహం, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున నగర మేయర్ స్రవంతిజయవర్ధన్ ప్రజలు అప్రమత్తం గా ఉండాలని మంగళ వారం ఒక ప్రకటన లో కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్పొరేషన్ అధికారులు అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టేలా ఆదేశాలు జారీచేశామని తెలిపారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను వెంటనే కార్పొరేషన్ అధికారులకు తనకు స్వయంగా సమాచారం ఇవ్వాలని మేయర్ సూచించారు.

## పురమిత్ర యాప్‌తో ఆన్లైన్ సేవలు సులభతరం
### కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ రూపొందించిన పురమిత్ర యాప్ ద్వారా మున్సిపల్ ఆన్లైన్ సేవలు సులభతరం అవుతాయని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురమిత్ర ఫోన్ యాప్ ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు, తాగునీటి కుళాయి పన్ను, ట్రేడ్ లైసెన్స్, శివరేజ్ టాక్స్, ప్రాపర్టీ మ్యూటేషన్ ఫీజు, లీజ్ అండ్ అగ్రిమెంట్స్ ఫీజ్, అడ్వర్టైజ్మెంట్ టాక్స్ లను సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. అదేవిధంగా యాప్ ద్వారా పబ్లిక్ హెల్త్ శానిటేషన్, వాటర్ సప్లై, టౌన్ ప్లానింగ్, అర్బన్ పావర్టీ అలివియేషన్, అడ్మినిస్ట్రేషన్, ఇంజనీరింగ్, స్ట్రీట్ లైటింగ్, రెవెన్యూ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా పురమిత్ర మొబైల్ యాప్ ను కింద కనబరచిన క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని మున్సిపల్ సేవలను సులభతరం చేసుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు.

## మాలేపాటి మృతికి పలువురు సంతాపం



**కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి నియోజకవర్గం టిడిపి మాజీ ఇంచార్జ్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున అకాల మరణం చెందిన సందర్భంగా ఆయనకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్చార్జ్ , మాజీ శాసనసభ్యులు, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ , న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు కరవది భాస్కర్ పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆయన సేవలను కొనియాడారు.

## జోహార్ పోలీసు అమరవీరులారా



**ఉదయగిరి, అక్టోబర్ 21, ప్రభాతవార్త** శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలొడ్డి పోరాడిన పోలీసు అమరుల సేవలను జాతి ఎప్పటికి మరువదు.. అమరుల స్ఫూర్తితో పోలీసు ఉద్యోగులు తమ విధి నిర్వహణకు పునరంకితం కావాలని ఆకాంక్షిస్తూ.. విధి నిర్వహణలో ప్రాణాలు అలర్పించిన పోలీసు అమరవీరులకు పోలీసు అమరవీఉల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఘన నివాళులు అర్పించారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 21, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 17267 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 71.016 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.625 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు

# పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

❖ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ❖ నగరంలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుక





**నెల్లూరు క్రైం, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి, వారి కుటుంబాలకు యావత్ భారతదేశం తోడుగా ఉన్నామని తెలియజేసే మహత్తరమైన రోజే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. మంగళవారం నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంస్మరణ స్థూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, అమర వీరుల కుటుంబసభ్యులు పోలీసు లాంఛనాల తో ఘన నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫునొ క్కులు అందించారు.

**కలెక్టర్ మాట్లాడుతూ**

1959వ సంవత్సరము అక్టోబరు 21వ తేదీ జమ్మూ కాశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ సరిహద్దు అయిన లడాక్ భూ భాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. 2024 సెప్టెంబర్ 1 నుండి 2025 అక్టోబర్ 1 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని, మన నెల్లూరు జిల్లాలో కూడా 10 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన పోలీస్ సిబ్బందికి తమ ప్రగాఢ నివాళి అర్పిస్తున్నామన్నారు. దేశం కోసం పోలీసు అధికారులు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరవలేనివని, వారు మన సమాజంలో ధైర్యం, సేవాభావం, నిబద్ధతలకు ప్రతీకలన్నారు. వారి కుటుంబాలకు మద్దతుగా, అండగా నిలబడటం మనందరి కర్తవ్యంగా భావించాలని, అదే వారిపట్ల మనం చూపగల అత్యున్నత నివాళిగా కలెక్టర్ పేర్కొన్నారు.

**దేశ భద్రతతోనే దేశాభివృద్ధి.. ఎస్పీ**

జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ దేశం స్వేచ్ఛగా, స్వాతంత్ర్యంగా ఉండడానికి పోలీసుల విరోచిత పోరాటాలే కారణమన్నారు. దేశ సరిహద్దుల్లో మనందరి భద్రత కోసం పోలీసు జవాన్లు అహర్నిశలు పహారా కాస్తూ, తమ జీవితాలను పోలీసులు పణంగా పెడుతున్నట్లు ఎస్పీ చెప్పారు. దేశ భద్రతతోనే దేశ అభివృద్ధి సాధ్యమన్న ఎస్పీ, దేశరక్షణ కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఘననివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎప్పుడూ భరోసా ఉంటామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఎంటివో ఆర్ఐ హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు తమ కవాతు ద్వారా అమరవీరులకు నివాళులర్పించగా, కలెక్టర్, ఎస్పీ, పోలీసు ఉన్నతాధికారులు గౌరవ వందనం చేశారు. అనంతరం కేవీఆర్ పెట్రోల్ బంకు సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీ, మానవహారంలో ఎస్పీ, కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య, డిఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, శ్రీధర్, వేణుగోపాల్, రామారావు, చంద్రమోహన్, ఏవో చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు
- నేడు జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు సెలవు
- పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 21, ప్రభాతవార్త** భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో భారీవర్షాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున, యంత్రాంగం ఎటువంటి ఇబ్బందులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ ఎవరూ సముద్రంలోనికి వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందించేందుకు బియ్యం, సరుకులు అందించేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వర్ష ముప్పును ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**నీటి మునిగిన పంట పొలాల ప్రాథమిక నివేదిక సిద్ధం చేయండి : కలెక్టర్**

నీటి మునిగిన పంట పొలాల వివరాలను సేకరించి ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో పంట పొలాలు ఎంతమేర నీటమునిగాయో క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు అందించాలని సూచించారు.

**నేడు పాఠశాలలకు సెలవు: కలెక్టర్**

తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ నెల 22న (బుధవారం) అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు: కలెక్టర్**

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాల వలన ఇబ్బందులు తలెత్తితే కంట్రోలు రూం నెంబర్లు: 0861 2331261, 7995576699 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కంట్రోలు రూంలో 24 గంటలు విధులు నిర్వహించేలా సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 24 గంటల పాటు ఈ కంట్రోలు రూం పనిచేస్తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అన్నిశాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రూపు రేఖలు మారనున్న కరేడు



- పరిశ్రమల ఏర్పాటుతో రూపు రేఖలు మార్పు
- యువతకు లభించనున్న ఉపాధి, ఉద్యోగావకాశాలు
- వేగవంతంగా భూసేకరణ..
- 672.279 ఎకరాలకు అవార్డు పాస్
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 21, ప్రభాతవార్త** పరిశ్రమల ఏర్పాటుతో కరేడు గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా భూసేకరణ చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఆయన అన్నారు. మొత్తం సుమారు 4800 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటివరకు 672.279 ఎకరాలకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో తాజాగా 79.745 ఎకరాలకు సంబంధించి అవార్డు పాస్ చేయడం జరిగింది. భవిష్యత్తులో మరింత వేగంగా భూసేకరణ కొనసాగిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. భూసేకరణకు ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధికి ముందుకొస్తున్న రైతులకు కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉపాధి, ఉద్యోగాలు స్థానిక యువతకు లభించనున్నాయి. ఇది కేవలం కరేడుకు మాత్రమే కాకుండా, మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుంది.

**భూములు కోల్పోయిన వారికి భరోసా**

పరిశ్రమల కోసం తమ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తోంది. సంతృప్తికరమైన నష్టపరిహారం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలతో భూములు ఇచ్చిన కుటుంబాలకు భరోసా కల్పిస్తోంది. తాజాగా 79.745 ఎకరాల భూములకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేయడం జరిగింది. దీంతో ఇప్పటివరకు మొత్తం 672.279 ఎకరాలకు అవార్డు ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు.

**మన గ్రామాల సమగ్ర అభివృద్ధి**

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలుకనుంది. రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌళిక వసతులు మరింత మెరుగుపడతాయి. దీనితోపాటు చిన్న చిన్న వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలు కూడా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు లభించడం ద్వారా వారు పరిశ్రమల్లో ఎక్కువగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.కరేడు గ్రామంలో ప్రారంభమైన ఈ భూసేకరణ భవిష్యత్తు తరాల కోసం ఒక అభివృద్ధి పథం. పరిశ్రమల రాకతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు జీవనోపాధికి స్థిరపడతాయి. రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ప్రభుత్వం సమగ్రాభివృద్ధికి కృషిచేస్తోందని కలెక్టర్ అన్నారు.

# పోరాటయోధుడు మాలేపాటి ఇకలేరు



- కన్నీటి పర్యంతం అయిన కుటుంబ సభ్యులు,అభిమానులు, టిడిపి నాయకులు



**దగదర్తి, అక్టోబర్ 21 , ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గంలో టిడిపి ఇంచార్జ్ గా కొనసాగిన సమయంలో ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాల పై పోరాడిన యోధుడు తెలుగుదేశం పార్టీకి 2022 నుంచి 2024 మధ్య కావలిలో టీడీపీకి ఇంచార్జ్‌గా ఎవరు లేని సమయంలో జీవం పోసిన వ్యక్తి మాలేపాటి సుబ్బానాయుడు. ఆయన సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులుగా ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ గా అవకాశం కల్పించారు. అయితే సుబ్బానాయుడు గత పది రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కు గురై విజయవాడ లోని మణిపాల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున హఠాత్మరణం చెందారు. అలానే ఆయన ఆరోగ్య పరిస్థితులను గమనిస్తూ ఉన్న ఆయన అన్న మాలేపాటి రవీందర్ నాయుడు కుమారుడు భానుచందర్ నాయుడు ఆకస్మిక మరణం చెందటంతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఒక్క రోజు వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో మాలేపాటి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఆయన ఆ వార్త తెలిసిన వెంటనే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆయన సతీమణి జ్యోతి దగదర్తి గ్రామానికి చేరుకొని తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే టిడిపి సీనియర్ నాయకులు పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు ,కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ,టిడిపి జిల్లా అధ్యక్షులు వక్స్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, జెడ్ శివప్రసాద్ , మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకట రామారావు, కొమ్మి లక్ష్మయ్య నాయుడు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారందరూ మాట్లాడుతూ సుబ్బానాయుడు ఆకశ్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని ఆయన కుటుంబంలో ఒకేసారి ఇరువురు చనిపోవడం చాలా బాధాకరమని ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో పాటు మేమందరం అండగా ఉంటామని తెలియజేశారు. అలానే మాలయపాటి కుటుంబం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే పార్టీ ఒకే సిద్ధాంతంతో పనిచేస్తూ పార్టీకి ఎనలేని కృషి చేసిందని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఎంతో అలానే కావలిలో 2019 లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయాక కష్టకాలంలో ఉన్నప్పుడు కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టి ఆనాటి వైసిపి పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి ప్రజలకు అండదండగా నిలిచిన వ్యక్తి కూడా మాలేపాటి సుబ్బానాయుడు.అ అలానే గతంలో తుమ్మలపెంట రోడ్డు గుంతల మయమయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిన సమయంలో తుమ్మలపెంట రోడ్డులో గుంతల్లో బురద నీటిలో పడుకొని నిరసన తెలిపి అందరు ప్రశంసలు పొందిన వ్యక్తి సుబ్బానాయుడుగా గుర్తింపు ఉంది. అలానే గత ప్రభుత్వంలో అరాచకాలు ప్రశ్నిస్తూ కేసులకు భయపడకుండా తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు, అండగా ఉంటూ సుబ్బానాయుడు ఉన్నాడు భయపడాల్సిన అవసరం లేదని టిడిపి క్యాడర్లో నూతన ఉత్తేజం నింపారు. అలా ఎన్నో పోరాటాలకు నేను ఉన్నానంటూ ఒక ప్రజానాయకుడిగా నిలబడి నిబద్ధతతో పనిచేసిన వ్యక్తిగా పోరాట యోధుడిగా సుబ్బానాయుడు మిగిలిపోయారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనై ఆయనకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసారు. దీంతో ఆయన అంత్యక్రియలు వేలాదిమంది అభిమానులు టిడిపి నాయకులు కార్యకర్తలు మధ్య అశ్రునయనాలతో కొనసాగింది.

## బోల్తాపడ్డ ఆర్టీసీబస్...తప్పిన ప్రమాదం



**జలదంకి,అక్టోబర్21,ప్రభాతవార్త:**జలదంకి మండలం నాగిరెడ్డిపాళెం క్రాస్‌రోడ్ సమీపంలో కెయురోడ్‌పై మంగళవారం ఆర్టీసీబస్ బోల్తాపడింది.చుట్టుప్రక్కల పొలాల రైతుల కదనంమేరకు కావలి డిపోకు చెందిన బస్ ఉదయం కావలినుంచి చామదలకు బయలుదేరింది.అయితే వీరాంజనేయ డైరి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగ కావలివైపు వెళతున్న లారి బస్‌పైకి వస్తుందని గుర్తించిన డ్రైవర్ సింహాద్రి దానిని తప్పించబోయే క్రమంలో ఎడమవైపు మార్జిన్‌దిగి పొలాలలో బోల్తాపడింది.అయితే తక్కువ సంఖ్యలో వున్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరిపీ ల్చుకున్నారు .విషయం తెలుసుకున్న జలదంకి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు.కావలి డిపో అది కారులు తరలివచ్చి బస్‌ను క్రేన్‌సహాయంతో రోడ్‌మీదకు చేర్చి డిపోకు తరలించారు.కాగ బస్ ముందుబాగం స్వల్పంగ దెబ్బతింది.

## రైతులకు అందుబాటులో యూరియా



**పొదలకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** పొదలకూరు మండల పరిధిలోని నల్లబాలెం, మొహమ్మదపురం, తాటిపర్తి, విరువూరు, దేగ పూడి,ఆర్ వైపాలెం గ్రామాలకు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ మండలంలో వరి పంట సాగుచేయు అన్ని గ్రామాలకు యూరియా అందుబాటులో ఉంటుంది. వరి పంట సాగుచేయు రైతులు మీ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బంది వద్ద యూరియా కార్డ్‌లు తీసుకొని ,ప్రభుత్వము సిఫార్సు చేసిన ఎకరాకు 3 బస్తాలు(మూడు దఫాలలో) యూరియా పొందవచ్చు అని తెలిపారు.మొదటి దఫా తీసుకున్న తరువాత 25 రోజులకు రెండో దఫా తరువాత 25 మూడో దఫా సరఫరా చేయుట జరుగుచున్నందున రైతులు ఎవరు కూడా యూరియా కోసం ఆందోళన చెందే అవసరం లేదు అని ఆయన రైతులకు తెలిపారు. ఫాస్పేట్ సంబంధించిన ఎరువులు ఆఖరి దుక్కిలో వేసుకోవడం ద్వారా వరి పంటకు వేసిన ఎరువులు సక్రమంగా అందుతుంది అని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసీఏస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, రమేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పెంచయ్య, అజయ్, అనిల్, కృష్ణ యాదవ్, కృష్ణా రెడ్డి, మల్లికార్జున యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సరయు హీరో షోరూం సబ్ డీలర్ మేక వేమయ్య పై అనుచిత వ్యాక్యలు చేసిన శ్రావణ్ కుమార్‌ని వెంటనే



**పొదలకూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** పొదలకూరు మండల టౌన్‌లోని డా బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ పొదలకూరు మండల కన్వీనర్ సబ్బు వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ లు మాట్లాడుతూ గత నెల 24 తేదిన గూడూరు లోని విశ్వసాయి షోరూం డీలర్ శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి మేక వేమయ్య హీరో షోరూంకు ఆయన లేని సమయంలో వచ్చి అక్కడ వర్కర్స్‌ను ఎక్కడకు పోయాడురా వేమయ్య కులం తక్కువ నాకొడుకు అంటూ అహంకారం పౌరుష పధజాలంతో కులం పేరుతో అతనిని తిడుతూ షోరూంలో కొనుగోలుకి సిద్ధంగా ఉన్న ఏడు బైకుల తాళాలు దౌర్జన్యంగా లాక్కొని పోయిన శ్రావణ్ కుమార్‌ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. అతని పై స్థానిక పొదలకూరులో పిర్యాదు ఇచ్చిన ఇప్పటి వరకు పలుమార్లు సీఐ ఎస్ఐ గారి చుట్టూ తిరుతున్న ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో డిపార్ట్మెంట్ వరు సమాధానం చెప్పాలని మీరు ప్రలోభాలకు తలొగ్గి కేసు నమోదు చేయకుండా వెనకడుగు వేస్తున్నారో చేప్పాలని ఇది వరకే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళిన ఎందుకు ఈ విషయంలో పోలీసులు కేసు నమదు చేయకపోవడం చూస్తుంటే ఉన్నత వర్గాల కోసమే చట్టాలు ఉన్నట్టు అనిపిస్తుందని ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి వెంటనే కేసు నమోదు చేసే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు అదేవిదంగా ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు వేగూరి వెంకటేశ్వర్లు మాదిగలు మాట్లాడుతూ అసభ్య పదజాలంతో దుర్బాషలాడిన శ్రావణ్ కుమార్ ని 24 గంటల్లో అరెస్ట్ చేయాలని లేని పక్షంలో అవసరమైతే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకు వెళ్తామని వారి ఆదేశాలతో చలో పొదలకూరు పిలుపునకు కూడ వెనకడుగు వేయబోమని తక్షణమే శ్రావణ్ కుమార్‌ని అరెస్ట్ చేయాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతకుంట అంకయ్య మాదిగ, దర్శిగుంట శ్రీనివాస్ మాదిగ, నక్కిబోయిన గంగాధర్ మాదిగ, సబ్బు వెంకటేశ్వర్లు మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, నరసింహ మాదిగ, ఏడు కొండలు మాదిగ, మేక రమేష్ మాదిగ, పి పెంచలయ్య మాదిగ, కుంచం సుబ్బయ్య మాదిగ, శివ మాదిగ, సూర్యబాయ్ మాదిగ, బాలకృష్ణ మాదిగ, చంద్ర మాదిగ, మురళి మాదిగ, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో పోల్గొన్నారు.

## జర్నలిస్ట్‌పై అక్రమ కేసులు అన్యాయం

**ఆత్మకూరు ,అక్టోబరు21,ప్రభాతవార్త :** జర్నలిస్ట్‌పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని , విచారణల పేరుతో వేధించడం విచారకరమని , ఏదేని చర్యలకు పోలీసులు పూనుకుంటే జిల్లా వ్యాప్తంగా అన్ని జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో తీవ్రంగా స్పందిస్తామని ఆత్మకూరు ప్రాంత ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్ జర్నలిస్టులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఎపియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి , ప్రముఖ దినపత్రిక జిల్లా బ్యూరో ఇన్‌చార్జ్ సి.హెచ్.మస్తాన్‌రెడ్డిపై తమ పత్రికలో నకిలీ మద్యం తాగిఇద్దరు మృతిచెందారన్న వార్తను పరిగణనలోకి తీసుకొని కలిగిరిలో నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్లలో అక్రమ కేసులు బనాయించడంతోపాటు విచారణపేరుతో పదే పదే నోటీసులిచ్చి వేధించడం పట్ల సోమవారం ఆత్మకూరులో జర్నలిస్ట్‌లు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తీవ్రంగా స్పందించి ఈ కేసులను బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈసమావేశంలో ఎపియుడబ్ల్యుజె నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు రాసిన వార్త తప్పు అయితే అనుసరించాల్సిన విధానాలువేరేగా ఉన్నాయని, అంతే తప్ప పోలీసులు కేసులు నమోదు చేసి విచారణపేరుతో నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల గొంతుకగా పత్రికల్లో వార్తలు ప్రచురితమవుతుంటాయని , ఆవార్తలు తప్పుగా ఎవరైనా భావిస్తే ఖండన ఇవ్వడం లేదా చట్టపరంగావ్యవహరించడం జరగాలే తప్ప పోలీసు కేసులు నమోదు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

## అమరులైన పోలీసులకు నివాళి: ఎస్సై కుమార్



**దగదర్తి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** దగదర్తి మండలం పోలీసు స్టేషన్‌లోని ఎస్సై జంపాని కుమార్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించు కుంటూ ఈ కార్యక్రమం జరుపుకుంటామని అదే విధంగా నిరంతరం శాంతి భద్ర తలను పరిరక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, నేర నియంత్రణకు కృషి చేస్తూ అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ ప్రజలు రక్షణ కొరకు అవసరమైతే నిద్రహారాలు మానైనా సేవలందిస్తున్నామని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు. వారికి గుర్తుగా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఇర్ల వెంకట రమణయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మాలేపాటి అంత్యక్రియల్లో పాల్గొన్న బి.ఎం.ఆర్



**కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి నియోజకవర్గ టిడిపి మాజీ ఇంచార్జ్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బా నాయుడు గత కొద్ది రోజులుగా మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున అకాల మరణం చెందిన సందర్భంగా ఆయన అంత్యక్రియలకు రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు పాల్గొని మాలేపాటి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం మాలేపాటి సుబ్బానాయుడు అన్న ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు కు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. మాలేపాటి సుబ్బనాయుడు తెలుగుదేశం పార్టీ కి చేసిన సేవలను కొనియాడారు.

## పంచాయతీ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన వైకాపా యువనేత వేముల శ్రీనివాసులు



**తోటపల్లి గూడూరు అక్టోబర్ 21 ప్రభాతవార్త :** మండలంలోని సౌత్ ఆములూరు గ్రామంలో శ్రీనివాస ఎంటర్ప్రైజెస్ షాప్ ముందు పంచాయతీ కాలువ మీదుగా తాత్కాలికంగా ఒక వంతెన నిర్మించబడింది. ఆ వంతెన కింద మురికి నీరు నిలబడి పోవడంతో కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయి, పరిసర ప్రాంతాల్లో చెదురుమదురు వాసనలు వ్యాపిస్తు న్నాయి. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి విజయదుర్గ స్వయంగా పరిశీలించి, వెంటనే సౌత్‌ఆములూరు గ్రామానికి చెందిన వైకాపా యువనేత, ప్రజా సేవకుడు వేముల శ్రీనివాసులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న వేముల శ్రీనివాసులు తక్షణం స్పందించి, సంబంధిత కార్మికుల సహాయంతో వంతెనను తొలగించేలా చర్యలు చేపట్టారు.వెంటనే చర్యలు తీసుకోవడంతో కాలువలో నీటి ప్రవాహం తిరిగి సజావుగా ప్రారంభమైంది. నీటి నిల్వలు తొలగిపోవడంతో పరిసర ప్రాంతాలు మళ్లీ పరిశుభ్రంగా మారాయి. గ్రామ ప్రజలు వేముల శ్రీనివాసుల సేవాభావం, వేగవంతమైన స్పందనను ప్రశంసిస్తున్నారు.సామాన్య ప్రజల సమస్యలకు ఎప్పుడూ ముందుండి పరిష్కారం చూపే వేముల శ్రీనివాసుల ధోరణి మరోసారి వెలుగులోకి వచ్చింది. గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న ఆయన చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

## 11 సీట్లకు ప్రతిపక్ష హోదానా..?



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలన్న దురుద్దేశంతోనే వైసీపీ నేతలు, మాజీ ముఖ్యమంత్రి జగన్ సూచనలతో రాద్ధాంతం సృష్టిస్తున్నారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మీడియా ప్యానలిస్ట్ కర్నాటి ఆంజనేయరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన పీపీపీ విధానం(పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్) కొత్త విధానం కాదని, అది ఎప్పటి నుంచో ఉందని, దీని ద్వారా మెడికల్ కళాశాలలు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగిస్తారని దీనిపై జగన్ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. పీపీపీ విధానం పూర్తిగా ప్రైవేటు కాదని, ఉదాహరణకు బీటీఓ విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులు రోడ్లు నిర్మిస్తారని, అంటే బిల్డ్ ఆపరేటర్ అండ్ ట్రాన్స్ ఫర్ అని అర్థమన్నారు. దీని ద్వారా రోడ్లు నిర్మించి టోల్ గేట్లు నిర్వహించి వారి పెట్టుబడి పూర్తయిన తర్వాత ట్రాన్స్ ఫర్ చేయడం జరుగుతుందని, ఇది కూడా పీపీపీ విధానమేనన్న విషయం జగన్ తెలుసుకోవాలన్నారు. మీ పార్టీకి 11 సీట్లు ఇచ్చింది ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించి, వారికి న్యాయం చేస్తారనే ఉద్దేశంతోనేనని ఇదీ జగన్ గుర్తుంచుకోవాలన్నారు. జగన్ అందుకు భిన్నంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ప్రతిపక్ష హోదా ప్రజలు జగన్‌కు ఇవ్వలేదన్నారు. దీనిపై అనవసర రాద్ధాంతం తగదన్నారు. 2014 వరకు దేశంలో 50 వేల మెడికల్ సీట్లు ఉంటే ప్రస్తుతం కేంద్రం దానిని 1,35,000 సీట్ల వరకు పెంపుదల చేసింది సుమారు 200 శాతం పెరిగిందని తెలియజేశారు. మోడీ వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలు పీజీ కాలేజీలు పెరిగాయని అన్నారు. అలాగే మన పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, మన రాష్ట్రంలో రైతుల కొరకు 50 లక్షల టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నారని, గతంలో చాలా తక్కువ సేకరించిన దాని వల్ల రైతులు దళారుల వలన నష్టపోయారని మన జిల్లాకు రెండు లక్షల టన్నుల ధాన్యం వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆశిస్తున్నామని జిల్లాలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశానని తెలియజేశారు. నాణ్యతలేని లిక్కర్ ద్వారా కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని జోగి రమేష్ తనతో చెప్పారన్న విషయం తన సహచరుడు జనార్ధన్ తెలియజేశారని ఇది వాస్తవం కాదా అని జగన్‌ను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణి రాజు, మండల అధ్యక్షుడు అడపాల మనద సాయి రెడ్డి, జిల్లా మీడియా ఇన్‌చార్జి చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో సముద్ర తీరానికి వెళ్ళకండి



**నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** నెల్లూరు తీర ప్రాంతాన్ని ఈ వారంలో తుఫాన్ ప్రభావితం చేయనున్న దృష్ట్యా రానున్న 24గంటల్లో వర్షాల తీవ్రత పెరగనుందని, డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సముద్ర తీర ప్రాంతానికి ఎవరు వెళ్ళవద్దని ప్రజలకు సూచించారు. మీ సమీప సచివాలయాలలో సంబంధిత అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. వరదలు లేదా భారీ వర్షాలు సంభవించి, నీటి మునక పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణ సహాయం కోసం అధికారులను సంప్రదించాలని ఒ ప్రకటనలో తెలియజేశారు. నెల్లూరు డివిజన్ సిబ్బంది 24 గంటలు 7 రోజులు ప్రజల భద్రత కోసం పని చేస్తారని వెల్లడించారు. నెల్లూరు డివిజన్ స్థాయిలో 24/ 7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఇళ్లలోనే ఉండాలని కోరారు. ఏదైనా సహాయం కోసం మీ స్థానిక ఎంపీడీవో, ఎంఆర్ఓ, వీఆర్వో, పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లు ఎప్పుడూ దగ్గర ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## నాదేండ్ల రంగయ్యకు నివాళ్ళు



**వరికుంటపాడు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** ప్రజల మనిషి యర్రంరెడ్డిపల్లి దివంగత సర్పంచ్ నాదేండ్ల రంగయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని నాదెండ్ల రంగయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం ఉండి, అందరి మనిషిగా మన్నిక పొందిన వ్యక్తి నాదేండ్ల రంగయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వరికుంటపాడు వైసీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు, వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకట సుబ్బయ్య, దక్కునూరు సర్పంచ్ ఉండేలా సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీ ముడియాల మురళీ కృష్ణారెడ్డి, రంగయ్య, కుటుంబ సభ్యులు బురగా వెంకట రామయ్య, నాదేండ్ల రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా



**వింజమూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ కేంద్రంలోని ఉదయగిరిలో మేకపాటి గౌతంరెడ్డి అగ్రికల్చరల్ కాలేజీ ప్రాంగణంలో గురువారం నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేషన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేకపాటి గౌతంరెడ్డి అగ్రికల్చరల్ కళాశాల ప్రాంగణంలో పలు కంపెనీలు, వారి మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన యువకులు హెచ్‌టీటీపీఎస్:// నైపుణ్యం. ఏపీ.జీవోవీ.ఇన్/యుజర్ లో రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పై బడి చదివిన 18 సంవత్సరాల నుండి 39 సంవతసరాల నిరుద్యోగ యువతీ, యువులు ఈ చక్కని సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కావున తెలుగుదేశం జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తమ తమ పంచాయతీలోని నిరుద్యోగ యువతీ, యువకులకు తెలియపరిచి ఈ జాబ్ మేళాలో పాల్గొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు.

## నేడు శ్రీసీతారాముల ఆలయ శంకుస్థాపన

**వింజమూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండెమడగల గ్రామంలో బుధవారం శ్రీ సీతారాముల ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడుతుందని నిర్వహణ కమిటీ సభ్యులు చీమల రత్నాకర్‌రెడ్డి, అంకినపల్లె ఓబుల్‌రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూక్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఒంగోలు, నెల్లూరు ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రశాంతి, కావ్య కృష్ణారెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి హాజరవుతారని అలాగే ముఖ్య అతిధులుగా ఏడిగండ్ల సుమంత్‌రెడ్డి, కో ఆపరేటీవ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చంచల బాబు యాదవ్, జిల్లా పాలనాధికారి హిమాన్స్ శుక్లా, జిల్లా ఎస్పీ అజితా, వేజెండ్ల కే.రామచంద్ర మోహన్, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు హాజరవుతారని, కావున గ్రామ పరిసరాల భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

## ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట రైతన్నలు ఆందోళన



**వింజమూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని తిక్కొళ్ళపాడు, ఊటుకూరు పంచాయతీలో ఉన్న రైతులు 10 రోజులుగా కరెంటు లేదని వింజమూరులోని సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తేలికపాటి వర్షానికి కూడా విద్యుత్ ఉండటం లేదని రాత్రంతా చీకట్లో బతకాల్సి వస్తుందని ఆరోపించారు. ముఖ్యంగా నారుమళ్ళు సమయం కావడంతో త్రీఫేస్ విద్యుత్ గత పది రోజులుగా లేదని పంట పొలాలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మేము రైతులం కాబట్టి మమ్మల్ని చులకనగా చూస్తున్నారు. అదే వింజమూరు టౌన్‌లో కానీ మరి ఎక్కడైనా కరెంటు పోతే తక్షణ స్పందించరా మేము ఫోన్ చేస్తే లైన్‌మెన్ తీసే పరిస్థితిలో కూడా లేదని అన్నారు. మేము మీకు అన్ని విధాలుగా సహకరిస్తున్న ఖర్చు పెట్టుకుంటామని చెబుతున్నా మమ్మల్ని ఎందుకు పట్టించుకోవడం లేదని కరెంట్ ఏఈ నాగూర్ వలిని ప్రశ్నించారు. కరెంట్ ఏఈ నాగూర్ వలి మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉండడంతో అత్యవసరం ఉన్న చోట సిబ్బంది పనులు చేస్తున్నారని రెండు రోజుల్లో మీ సమస్యలన్నీ తీరుస్తానని మీకు లైన్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత లైన్‌మెన్‌ని పిలిచి తక్షణం రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అలాగే కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి తక్షణం ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో రైతులు శాంతించారు.

## భారీ వర్ష సూచన

**బిట్రగుంట అక్టోబర్ 21 ప్రభాతవార్త:**ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన అల్ప పీడనం వలన రాబోయే 4 రోజుల్లో ఈ నెల 21 నుండి 25 వ తేది వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మండల తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.. కావున, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండవలసిందిగా పేర్కొన్నారు.ఏమైనా అనుకోని సంఘటనలు జరిగినచో సహాయం కొరకు తహసీల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేయబడిన కంట్రోల్ రూమ్ ను సంప్రదించాల్సినదిగా సూచించారు.

## గ్రామ సుభిక్షం కొరకే అమావస్య పూజలు



**కలువాయి అక్టోబర్ 21 ప్రభాతవార్త :** గ్రామ సుభిక్షం కోసం గ్రామంలో సర్వదోషాలు ,సర్వం రోగాలు, నివారణార్థం ప్రతి మాసం అమావస్యనాడు గ్రామ దేవత శ్రీకలువాయమ్మ అమ్మవారి సన్నిధి నందు దేవి మూల మంత్ర హోమాలను నిర్వహి ంచడం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.మంగళవారం అమావస్య సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా మహాగణపతి,నవగ్రహ త్రయంబక గ్రామ దేవతల మూల మంత్ర హోమాలతోపాటు ప్రత్యేకంగా శ్రీ లక్ష్మీదేవిమూల మంత్ర హోమాలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని యజ్ఞనేశ్వరుడికి సమర్పించి భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## మాలేపాటి సుబ్బానాయుడు మరణం టిడిపి పార్టీకి తీరని లోటు



**కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, కావలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.మాలేపాటి సుబ్బా నాయుడు మరియు దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మాలేపాటి బానుచందర్ స్మారకార్థం కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సంస్మరణ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యేదగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్‌గా 2022 నుండి 2024 వరకు సుబ్బానాయుడు ఎంతో నిబద్దతతో పనిచేశారన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారన్నారు.ఆయన అకాల మరణం కావలి నియోజకవర్గానికి మాత్రమే కాకుండా, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మరణం పార్టీ కార్యకర్తలందరినీ దుఃఖంలో ముంచేసిందని అన్నారు. తన ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనే సుబ్బానాయుడు సోదరుని కుమారుడు బానుచందర్ కూడా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించడం హృదయ విదారకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువ నాయకుడిగా ఎదుగుతున్న బానుచందర్ భవిష్యత్తులో పార్టీకి అద్భుతమైన నాయకత్వం చూపుతాడని అందరూ నమ్మిన సమయంలో ఆయన అకాల మరణం దగదర్తి మండలానికి తీరని లోటని తెలిపారు. సుబ్బానాయుడు సేవలను గుర్తించి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని, రాష్ట్రవ్యాప్తంగా ఆయన సేవలను వినియోగించుకోవాలని చంద్రబాబు భావించారన్నారు. కానీ అకాల మరణం రాష్ట్ర తెలుగుదేశం పార్టీకి, ముఖ్యంగా నెల్లూరు జిల్లాకు పెద్ద నష్టంమని అన్నారు.ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని, ఆ ఇద్దరి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు న్నానని అన్నారు.ఆ కుటుంబానికి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై పుష్పాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, పట్టణ టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ కిషోర్, బాబు జ్యోతి బాబురావు,పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు ఆర్షియా బేగం, టిడిపి నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరువీధి ప్రసాద్, పుప్పాల శ్రీనివాసులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొరుగుసేవల సిబ్బందికి రెయిన్ కోట్లు, యూనిఫామ్ బహుకరణ



**కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఆర్టీసీలో బస్సులను, బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసే కార్మికులు, సరకు రవాణా ( కార్గో ) విభాగంలో పనిచేసే సిబ్బంది, హమాలీలు ఎపియస్ ఆర్టీసీకి గుండెకాయ వంటివారని ఎపియస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కావలి డిపో బస్టాండ్ మరియు గ్యారేజ్ నందు పొరుగుసేవల ద్వారా పనిచేసే పారిశుధ్య కార్మికులు, కార్గో, మెకానికల్ సిబ్బందికి రెయిన్ కోట్లు, సమదుస్తులు బహుకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సురేష్ రెడ్డి మాట్లాడారు, పొరుగుసేవల సిబ్బందికి ఈయస్ఐ, పియఫ్ సౌకర్యం ప్రాథమిక హక్కు అని, వాటివలన ఉచిత వైద్యం, పెన్షన్ పొందవచ్చని పేర్కొన్నారు. 15 రోజులలో ఈయస్ఐ, పియఫ్ సౌకర్యం లేని కార్మికులకు ఆయా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ డి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)యం కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) మల్లికార్జున, జిల్లా టెలికామ్ బోర్డు సభ్యులు కె బ్రహ్మానందం, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి పురుగు సేవల సిబ్బంది సేవలను కొనియాడి వారిని అభినందించారు. అనంతరం పురుగు సేవల సిబ్బందిని సన్నపురెడ్డి సురేష్ రెడ్డి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఆర్టీసీ సిబ్బంది యం రామకృష్ణ (సీనియర్‌ట్రాఫిక్ ఇన్స్పెక్టర్), డిరవిప్రకాష్(ఏడిసి),జలదంకి యంపిటిసి కెమాధవరావు, బీజేపీ నాయకులు కంచర్ల మురళీకృష్ణ, వివి రంగారెడ్డి, సివిసి సత్యం పులిమి మాధవి రెడ్డి, మందా కిరణ్ కుమార్, పరసు వెంకటేశ్వర్లు, గుడిపల్లి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి తహశీల్దార్



**కొడవలూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:**మండలంలోని అతి భారీ వర్షపాతం ఎక్కువగా ఉండడం వలన లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురవడం జరుగుతుంది. ప్రజలు చెట్ల కింద, పొలాల్లో ఉండరాదు సురక్షిత నివాసంలో ఉండాలని కోరారు. అదేవిధంగా దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేయరాదు ప్రజలు సురక్షితంగా ఉండాలన్నారు. మండల వీఆర్వోలు ఆయా గ్రామాల్లో వర్షాల పట్ల విషయాలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు.

## ప్రజలు సురక్షితంగా ఉండాలి: ఎంపీడీవో



**కొడవలూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:**జిల్లాకు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజల సురక్షితంగా ఉండాలని దూర ప్రాంతాలకు ప్రయాణం చేయడం మంచిది కాదని స్థానిక ఎంపీడీవో వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. కొడవలూరు మండలంలోని 74.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయి ంది. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోనే ఉండి పరిస్థితిని సమీక్షించాలన్నారు. పెనుగాలులకు రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లని సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు.వైద్య ఆరోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు మంచినీటి సరఫరాకు అంతర్యం లేకుండా పనులు చేపట్టవలసిందిగా గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు.

## రాష్ట్ర ఉద్యోగులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం



**నెల్లూరు అక్టోబర్ 21,ప్రభాతవార్త విద్య :** ఒకపక్క ఉద్యోగుల పొట్టగొడుతూ వారి సంపదను స్వాహా చేస్తున్న కూటమి ప్రభుత్వం వారిని ఉద్ధరించినట్టుగా ప్రచారం చేసుకుంటోందని, దీపావళి కి విడుదల చేసిన ఒక పెండింగ్ డీఏ కూడా మోసమేనని వైయస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు .నగరంలోని స్థానిక సిటీ వైకాపా పార్టీ కార్యాలయంలో విలేకరులు సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళికి ముందు చంద్రబాబు ఉద్యోగులతో మాట్లాడి నాలుగు పెండింగ్ డీఏల్లో ఒకే ఒక్కటి రిలీజ్ చేస్తామని చెప్పాడని అన్నారు. ఆ అరియర్స్ ని కూడా రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని చెప్పి ఉద్యోగుల కడుపు మీద కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషన్, ఐఆర్, రూ. 34 వేల కోట్ల పెండింగ్ బకాయిల గురించి ప్రస్తావించకుండానే చంద్రబాబు ప్రెస్‌మీట్ ముగించడం చూస్తే ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమైందని ధ్వజమెత్తారు.వైయస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలలో ఆర్నెళ్లకు ఒక డీఏ చొప్పున 10 డీఏలు ఇవ్వడంతో పాటు గత చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్ పెట్టిన డీఏ ను కూడా రిలీజ్ చేసి మొత్తం 11 డీఏలు ఇవ్వడం జరిగిం దన్నారు .మాజీ సీఎం వైయస్ జగన్ నాలుగు డీఏలు పెండింగ్ పెడితే అందులో ఒక డీఏ ఇస్తున్నట్టు చంద్రబాబు డీఏల విషయంలో పచ్చి అబద్ధాలు చెప్పరన్నారు .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వాల్సిన డీఏలను కూడా జగన్ ఖాతాలో వేసి తప్పించుకోవాలని చూడటం హేయమని వైయస్సార్సీపీ హయాంలో ఒక డీఏ పెండింగ్ లో ఉండటానికి కూడా కారణం కేంద్ర ప్రభుత్వ జాప్యమేమని తెలిపారు.పీఆర్సీ కమిషన్ కాల పరిమితి ముగిసి ఇప్పటికే రెండేళ్ళ మూడు నెలలు గడిచిపోయిందని,అయినా కొత్త పీఆర్సీ వేయలేదన్నారు .ఉద్యోగుల సంఘాల మీటింగ్‌లో పీఆర్సీ కమిషన్ వేస్తామని చెప్పకుండా తప్పించుకోవడం దుర్మార్గమని తెలిపారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి వైయస్ జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.22 వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలున్నాయని,ఆ రూ.22 వేల కోట్లు దఫదఫాలుగా చెల్లిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఉద్యోగుల ఓట్లతో గెలిచిన చంద్రబాబు, తీరా గెలిచాక వాటి ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు.ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా కర్నాటక, తమిళనాడుతో పోల్చి చూపించి ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలి, ఉద్యోగుల జీతాలు తగ్గించు కోవాలని చంద్రబాబు హేళనగా మాట్లాడటం మంచిపద్ధతికాదని ,సీఎం,డిప్యూటీ సీఏం, మంత్రులు చేస్తున్న దుబారాను తగ్గిస్తే, ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుందన్నారు . వెంటనే బకాయిలని విడుదల చేయలని డిమాండ్ చెసారు . ఈ కార్యక్రమంలో నాయకుల తదితరులు పాల్గొన్నారు .

## కోటి సంతకాల సేకరణకు ప్రజల్లో మంచి స్పందన



**వలేటివారిపాలెం అక్టోబరు 15 ప్రభాతవార్త :**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన రచ్చబండ మరియు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంకు ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని వైసీపీ మండల అధ్యక్షుడు అనుమోలు లక్ష్మినరసింహం తెలిపారు. మండలంలోని అంకభూపాలపురం, పోలినేని చెరువు గ్రామాల్లో సోమవారం రచ్చబండ మరియు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకతీతంగా బడుగు బలహీనవర్గాల ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.మెడికల్ కాలేజీల నిర్వహణ ప్రభుత్వ ఆదీనంలోనే ఉండాలని ప్రజలు కోరుతున్నట్లు చెప్పారు.అన్ని కులాల్లోనే పేదవర్గాలకు వైద్య విద్య అందాలంటే ఈ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని పలువురు సూచించినట్లు వివరించారు.ఈ మేరకు సంతకాలు ద్వారా తమ తమ అభిప్రాయాల్ని వ్యక్తపరుస్తున్నట్లు ఆయన వివరించారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మరియు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర ,వివిధ హోదాల్లో ఉన్న వైసీపీ నేతలు యాళ్ల శివకుమార్‌రెడ్డి, సూరా పుల్లారెడ్డి, మండల వైసీపీ నేతలు పొట్టేళ్ల క్రిష్టయ్య,గుత్తా గోపి,కట్టా హనుమంతరావు,ఇరుపని అంజయ్య,మర్రి అంజయ్య,ప్రగడ సుధాకర్, చింతలచెరువు తిరుపతయ్య, బొమ్మరెడ్డి నరసింహ,బత్తుల శ్రీనివాసులు,పాలకీటి రామ్మూర్తి, పాలకీటి కొండలరావు,పాలకేటి నాగేశ్వరరావు, బక్కమంతుల రామ్మూర్తి, త్రాసుల వీరాచారి, బొమ్మరెడ్డి మాలకొ ండయ్య,అత్యాల యాకోబు, అత్యాల ఎర్ర కొండయ్య, మంగి ఏసోబు, మంగి మాలకొండయ్య, కూచిపూడి కోటేశ్వరరావు, డొక్కా నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సహాలతో సమరసతా దీపావళి



బుచ్చి అక్టోబర్ 21 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెంలో సమరసతా దీపావళి నిర్వహించారు. శ్రీగోపాల కృష్ణయ్య స్కూల్ కరస్పాండెంట్ సమసతావేదిక జిల్లా నాయకులు నేలనూతల శ్రీదర్ కార్మికులకు కొత్త దుస్తులు, స్వీట్లు, టపాసులు అందజేశారు. వారితో కలిసి దీపావళి పండుగ జరుపుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా దీపావళి పండుగ జరుపుకున్నప్పుడే నిజమైన దీపావళి అని అన్నారు.

## సంగం బ్యారేజికి 79 గేట్లు ఎత్తివేత





సంగం అక్టోబర్ 21 ప్రభాతవార్త పెన్నాపరివాహా ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు అలాగే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సోమశిల డ్యామ్‌కు పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. అధికారులు సోమశిల నుండి సంగం బ్యారేజికి వరద నీరు విడుదల చేశారు. వెంటనే స్పందించిన ఇరిగేషన్ అధికారులు సంగం బ్యారేజి వద్ద 79 గేట్లు ఎత్తి 42 వేల క్యూసెక్కులు వరద నీటిని దిగువకు విడుదల చేశారు. దిగువన వున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ ఈ సందర్భంగా మాట్లాడుతు నదికి పక్కన వున్న గ్రామాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవ్వరు నదిలోకి వెళ్ళరాదని హెచ్చరించారు.

## పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జి కలేనా...?

**- కనీసం మట్టి కట్టనైనా పటిష్టంగా నిర్మించండి**



నెల్లూరు అగ్రికల్చర్ ,అక్టోబర్ 21, ప్రభాతవార్త నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెం కలుజు వద్ద గత ఐదేళ్లుగా వాహనాల రాకపోకలు సక్రమంగా సాగక ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజలు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ మార్గంలో భారీ వర్షాలు, వరదలు సంభవించిన ప్రతి ఏటా ప్రజల బాధలు వర్ణణాతీతంగా మారాయి. గత మూడేళ్ల క్రితం కలుజు పక్కనే ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ప్రభుత్వం ఒక మట్టి కట్టను నిర్మించింది. అది ప్రస్తుతం గుంతల మయంగా మారి వాహనాల రాకపోకలకు విఘాతం ఏర్పడుతోంది. ట్రాఫిక్ సక్రమంగా సాగని పరిస్థితి నెలకొంది. ఈ వర్షాకాలంలో మట్టికట్టపై గ్రావెల్‌తో చదును చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు. కలుజుపై బ్రిడ్జి కలగా మారిన నేపథ్యంలో కనీసం ఈ మట్టి కట్టనైనా పటిష్టంగా నిర్మించాలని కోరుతున్నారు.

## కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న అధికారులు



కలిగిరి, అక్టోబర్21, ప్రభాతవార్త; మండల కేంద్రమైన కలిగిరిలో మంగళవారం నుండి కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇటీవల వార్తలో గ్రామ సింహాలనుండి కాపాడండి అనేవార్త ప్రురణ కావడం దానిపై అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం జరిగింది. దీనిపైస్పందించిన అధికారులు కుక్కలను నివారించే క్రమంలో కుక్కల జాతి వృద్ధికాకుండా కలిగిరి పంచాయితీలో వ్యాక్సిన్ వేసేకర్యక్రమం చేప ట్టారు.

## తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే



కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త : తుఫాను హెచ్చరికలు నేపథ్యంలో కావలి నియోజకవర్గంలో విస్తారం గా కురుస్తున్న వర్షాల పట్ల నియోజ కవర్గం ప్రజలు అందరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కావలి శాస నస భ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మం గళవారం ఆయన మాట్లాడారు విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు,అన్నదాతలు తగిన జాగ్రత్తలుతీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు, నాయకులకు సమాచారం అందించాలన్నారు. ఇబ్బందికర పరిస్థితుల్లో నాయకులు, కార్యకర్తలు ప్రజలకి అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రెవిన్యూ,విద్యుత్, పోలీస్,అగ్నిమాపక సిబ్బంది, అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

## కుటుంబ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య



కోవూరు, అక్టోబరు 21ప్రభాతవార్త : కోవూరు పంచాయతీ పరిధిలోని పూనూరువారి వీధిలో నివాసం ఉంటున్న బైనా రాజగోపాల్ కుటుంబ కలహాలు, భార్యాభర్తల గొడవ వలన మనస్థాపానికి గురై రెండు రోజుల క్రితం ఉరి వేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి దగ్గర నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై ఖాదర్‌బాషా, ట్రైనీ ఎస్సై సురేఖలు నిశిత పరిశీలన చేపట్టారు. భార్యాభర్తల గొడవ వలన భార్య అలిగి వెళ్లడంతో మనస్థాపానికి గురైన రాజగోపాల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచార ణలో వెల్లడైంది. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తర లించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

## పోలీసుల చొరవ భేష్



కోవూరు, అక్టోబరు 21ప్రభాతవార్త : చీకిరేణి వీధి ప్రాంతంలో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైన సమాచారం తెలుసుకున్న ఎస్సై ఖాదర్‌బాషా, ఏఎస్సై శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ దేవిడ్, కానిస్టెబుళ్లు మధు, సునీల్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారి సహకారంతో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పడం పట్ల ప్రజల్లో పోలీసులు చేస్తున్న కృషిని చూసి అభినందనలు కురిపించారు. మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా ఆ ప్రాంతానికి చెందిన ముస్లిం యువకులు, చుట్టుపక్కల వారు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు తమ వంతుగా చర్యలు చేపట్టి ఎట్టకేలకు మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి ఏఈ దిలీప్‌కుమార్‌లు పరిశీలించి నూతన గృహ నిర్మాణం కొరకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని ఈ సందర్భంగా బాధితురాలికి తెలియజేశారు.

## విశ్వంహైస్కూల్‌పై దాడికి పాల్పడ్డ ఏబివిపి సభ్యులపై కఠినచర్యలు చేపట్టాలి




నెల్లూరు,అక్టోబరు21 ప్రభాతవార్త – విద్య నెల్లూరు రూరల్ పరిధిలోని అల్లీపురం విశ్వం హైస్కూల్‌లో దా డికి పాల్పడిన అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఏబివిపి) సభ్యులపై తక్షణం కఠిన చర్యలు చేపట్టాలని అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దాడి జరిగిన విశ్వం హైస్కూల్‌ను జిల్లాలోని అపస్మా పాఠశాలల కరస్పాండెంట్స్, జిల్లా అధ్యక్ష్య కార్యదర్శులు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతు విశ్వం హైస్కూల్‌పై ఏబివిపి నాయకులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థి సంఘాలు, సం ఘ నాయకులు విద్యాపరమైన సమస్యలు ఉంటే పోరాటాలు చేయ్యాలేగానీ ఇలా దాడులకు పాల్పడటం హే యమన్నారు. సుమారు 11గంటల ప్రాంతంలో ఏబివిపి నాయులు పాఠశాలలో ప్రవేశించి దూర్భషలాడు తూ,అక్కడే ఉన్న కుర్చీలను, కిటికీ అద్దాలను పగలగొట్టారని, ఆ సమయంలో అక్కవే ఉన్న చిన్నారులు ఈ సంఘటనలకు బయాందోళణలకు గురి కావటం జరిగిందన్నారు. విద్యాశాఖ కమిషర్ విదుదల చేసిన జీఓ ప్రకారం విద్యాలయాల్లో ఏ సంఘాలు వెల్లకూడదని, దౌర్జన్యాలకు పాల్పడకూడదని ఉందని అయినా ఏబివిపి నాయుకలు దాడులకు పాల్పడి చట్టాలన్ని ఉలంగించారన్నారు. దీనిపైతాము నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి మరో పాఠశాలపై ఇటువంటి దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో అపస్మా జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్, కార్యదర్శి రామ్మెహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, నగర అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, కార్యధర్శి రమేష్,కోవూరు అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, విశ్వోదయ వెంకటాద్రి, విశ్వం స్కూల్స్ కరస్పాండెంట్ బాలకృష్ణజిల్లాలోని పాఠశాలల కర్పసాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మాలేపాటి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్

**- ప్రభుత్వ లాంచనాలతో సుబ్బానాయిడు అంత్యక్రియలకు ఆదేశాలు**





కావలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కావలి టిడిపి మాజీ ఇంచార్జ్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆకస్మిక మృతి పట్ల ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడుతూ సుబ్బానాయుడిని కోల్పోవడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని అలానే ఆయన చేసిన అనేక పోరాటాలు మరువలేనివని ఆయన కుటుంబంలో జరిగిన వరుస విషాదాలు తీవ్రంగా కలిసి వేశాయని ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారి వ్యక్తిగత ట్విట్టర్‌లలో తెలిపారు. అలానే ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని కలెక్టరు ఆదేశాల జారీ చేయడంతో ఆయన అంత్యక్రియలను కలెక్టర్ హిమాన్ శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రభుత్వ ప్రతినిధులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు హాజరై ఘన నివాళులర్పించారు. అలానే ఆయన అంతిమయాత్రలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కాకర్ల ,ఇంటూరి పాశం సునీల్, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, వక్ఫ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ , టిడిపి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకట రామారావు కొమ్మి లక్ష్మయ్య నాయుడు పార్టీ ముఖ్య నేతలు పాల్గొని సుబ్బానాయుడుకు ఘన వీడ్కోలు పలికారు. అనంతరం ఆయనకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి అశ్రునయనాలతో ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మాలేపాటి అభిమానులు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ నేతలను కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర రెడ్డి



నెల్లూరు క్రైం, అక్టోబర్ 21, ప్రభాతవార్త: నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న వైసీపీ నేతలు మీరా మోహిద్దీన్,అబ్దుల్ మస్తాన్‌లను మంగళవారం ములాఖత్ ద్వారా వైఎస్ఆర్సీపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కలిశారు. ఇటీవల అరెస్టు అయి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఇద్దరు నేతలను పరామర్శించి వారితో మాట్లాడి చంద్రశేఖర్ రెడ్డి ధైర్యం చెప్పారు.

## మాలేపాటి భానుంచదర్, మాలేపాటి సుబ్బానాయుడు అంత్యక్రియలు

**- నివాళులర్పించిన పలువురు నేతలు**



దగదర్తి, అక్టోబర్ 21, ప్రభాతవార్త మాజీ ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు కుమారుడు మాలేపాటి భానుచందర్ శనివారం రాత్రి మరణించిన సంగతి అందరికి తెలిసిందే. అతని అంత్యక్రియలు సోమవారం ఉదయం 9 గంటలకు దగదర్తి గ్రామంలో నిర్వహించారు. అంత్యక్రియలకు వారి బంధువులు, ప్రజా ప్రతినిధులు టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిమానం చాటుకున్నారు. అంత్యక్రియలు బాణసంచాలతో పూలుచల్లుకుంటూ ఎంతో ఘనంగా నిర్వ హించారు. అంతే కాకుండా అదే రోజు ఆయన చిన్న నాయన అయిన ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆరోగ్యం సరిలేక విజయవాడ హాస్పిటల్లో మరణించడంతో సోమవారం సాయంత్రం 4గంటలకు ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు ఘనంగా చేశారు. టీడీపీకి వెన్నుముక లాంటి నాయకులు ఇద్దరిని కోల్పోయామని, అలాంటి నాయకులని చూడబోమని టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఒకే రోజు వారి కుటుం బంలో ఇద్దరికి అంత్యక్రియలు జరగడం వారి కుటుంబ సభ్యులకు ఎంతో బాధాకరమని చెబుతున్నారు.

## 24 తేదిన జిల్లాకు 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ రాక : జిల్లా కలెక్టర్



నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 21, ప్రభాతవార్త 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ ఈనెల 24న జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 3.30 గంటలకు సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి ఉదయం 7.08 గంటలకు నెల్లూరుకు చేరుకొని గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు.మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.00 వరకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆరోగ్య, విద్య రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు అమృత్ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధాన్ మంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతి తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతారు.కార్యక్రమానంతరం సాయంత్రం 04.35గంటలకు వందే భారత్‌లో నెల్లూరు నుండి బయలుదేరి రాత్రి 07.40 గంటలకు గుంటూరుకు చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కోవూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ప్రజల రక్షణకు తగిన చర్యలు తీసుకోండి**

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోనులో మాట్లాడిన ఎమ్మెల్యే**



కోవూరు, అక్టోబరు 21ప్రభాతవార్త జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమశిల నుంచి వరద వచ్చే ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో పెన్నా తీరం వెంట ఉన్న కోవూరు నియోజకవర్గ ప్రజల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్లో ఆమె మాట్లాడారు. ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె చర్చించారు. పెన్నా పొర్లుకట్టలు పలు చోట్ల బలహీనంగా ఉన్నాయని, కట్టల వెంట ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వరద ముప్పు నుంచి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు కూడా వరద, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న తరుణంలోలోతట్టు, తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్వోలు, వీఆర్వోలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బంగాళ ఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు. తీర ప్రాంతాల్లో గంటకు 45-65 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, సముద్రంలో ఉన్న మత్స్యకారులు అక్టోబర్ 21 లోపు తీరానికి చేరుకోవాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## రేకుల ఇల్లు దగ్ధం

**- 24 గ్రాముల బంగారం, రూ. 50 వేలు నగదు అగ్నికి ఆహుతి**



కోవూరు, అక్టోబరు 21ప్రభాతవార్త : దీపారాధన చేసి కుమార్తెను చూసేందుకు ఇంటికి తాళం వేసి ఓ మాతృమూర్తి బయలుదేరిన కాసేపటికే దీపం కారణంగా మంటలు వ్యాప్తి చెంది ఆ ఇల్లు పూర్తిగా దగ్ధమై రూ. 50 వేలు నగదు, 24 గ్రాముల బంగారం పూర్తిగా అగ్నికి ఆహుతైన సంఘటన కోవూరు పంచాయతీ పరిధిలోని చీకిరేణి బావి వీధిలో మంగళవారం ఉదయం నెలకొంది. ఈ ప్రాంతానికి చెందిన వంగపాటి మాధవి కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్న ఒక్క కుమార్తెను వసతి గృహంలోపెట్టి చదివించుకుంటుంది. మంగళ వారం ఉదయం పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని కుమార్తెను చూసేందుకు ఇంటికి తాళం వేసి బయలుదేరింది. ఈ నేపథ్యంలో ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. వారంతా తమ ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను యుద్ధప్రాతిపదికన వెలుపలికి తీసుకువచ్చేలా చర్య లు చేపట్టారు. ఈ లోగా చుట్టుపక్కల వారు మాధ వికి



ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో ఆమె గుం డెలు బా దుకుంటూ సంఘటనా స్థలానికి చేరుకుని లబోదిబోమని కన్నీరు పెట్టుకుంది. భర్త లేక పోయినా కూలీ నాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నామని, ఈ సమయంలో నిప్పు అంటుకుని తమ ఇల్లు పూర్తిగా దగ్ధమైందని మాధవి కన్నీటిపర్యంత మయ్యారు.

## కుండపోత ..... అన్నదాతకు గుండెకోత

**భారీ వర్షంతో భారీగా నష్టం**



చేజర్ల అక్టోబర్ 21 ప్రభాతవార్త గత నాలుగురోజుల నుండి కురుస్తున్న వర్షాలకు తోడుగా బంగా ళాఖాతంలో అల్పపీడనం పుణ్యమా అని కుండపోత వర్షంతో అన్నదాతకు గుండె కోత మిగిల్చింది. చేజర్ల మండలంలో భారీగా కురుస్తున్న వర్షాలకు వరి పంట పొలాలు పూర్తిగా నీట మునిగి సముద్రం ను తలపిస్తున్నాయి. దీంతో చేతికి వచ్చిన పంట నీట మునిగడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతం అయ్యారు. అన్నదాతల వివరాలు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల మండలంలోని కాకివాయి గ్రామంలో సుమారు 100 ఎకరాలు వరి పంట పూర్తిగా నీట మునిగింది. సన్న చిన్న కారు రైతులు ఎకరానికి 30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికి వస్తుందన్న సమయానికి ఆకాల వర్షాంతో అన్నదాతలకు కన్నీరు మిగిల్చింది. ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన పంట పొలాలను పరి గణలోకి తీసుకోని ఉదారంగా ఆర్థికంగా సాయం అందిస్తే తప్ప ఇబ్బందులు నుండి కోలు కోలేమని , అన్నదాతలు ప్రభుత్వం సాయంకోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చొరవ చూపి అన్నదాతల గోడును ప్రభుత్వానికి నివేదించి సహాయపడాలని కోరు తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి అన్నదాతలకు ఉదారంగా ఆదుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉంది. చేజర్ల మండలం కాకివాయి గ్రామంలో అకాల వర్షాలకు వరి పంట నీట మునిగిన విషయం మండల వ్యవసాయాధికారి దృష్టికి ప్రభాతవార్త తీసుకొని వెళ్ళడంతో వ్యవసాయాధికారి హిమ బిందు స్పందించారు.సుమారు 90 ఎకరాలు వరి పంట ను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపీనట్లు ఆమె తెలియజేశారు.



## కాలువలో వ్యర్థాలను తొలగించే ఎక్స్కవేటర్ మిషన్ పనితీరుపై కమిషనర్ అరా



నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 21,ప్రభాతవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుద్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్.వి.జి.ఎస్ కళాశాల సమీపంలో మురుగునీటి కాలువలలో వ్యర్థాలను తొలగించే ఎక్స్కవేటర్ మిషన్ పనితీరును ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఎక్స్కవేటర్ ద్వారా మురుగు కాలవలలో ప్రవహించే వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని, మురుగు నీటి ప్రవాహంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాలువలలో తొలగించిన ప్లాస్టిక్ వస్తువులు, ఇతర వ్యర్థాలను రీసైక్లింగ్ ప్రాసెస్ కోసం తరలించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.కార్పొరేటర్ కర్తమ్ ప్రతాప్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సంతపేట మార్కెట్ ను మంగళవారం పరిశీలించిన కమిషనర్ వై.ఓ నందన్



నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 21,ప్రభా తవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ కమి షనర్ వై.ఓ నందన్ స్థానిక సంతపేట మా ర్కెట్ ను మంగళవారం పరిశీలించారు. ఇటీ వల మార్కెట్లో అగ్నిప్రమాద సంభవించిన దుకాణాలలో నూతనంగా చేపడుతున్న ఎలక్ట్రికల్ వైరింగ్, పెయింటింగ్ ఇతర పను లను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు జారీ చేశారు. మార్కెట్ పరిధిలో నిర్దే శించిన మేరకే వ్యాపారాలు జరుపుకోవాలని, రోడ్లను ఆక్రమించి ఇతర దుకాణాలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని యజమానులకు హెచ్చరించారు. మార్కెట్ పరిధిలో ప్రాంగణాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎవరి పరిధి మేరకు వారు పారిశుద్ధ నిర్వహణను ప్రతిరోజు చేపట్టాలని కమిషనర్ సూచించారు. కప్పిర శ్రీనివాసులు, నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కండలేరు జలాశయాన్ని,హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

**..జలాశయంలో 61 టీయంసీల నీటిని నిల్వ చేస్తాం**



కండలేరుడ్యాం(రాపూరు), అక్టోబరు21ప్రభాతవార్త మండలంలోని కండలేరు జలాశయాన్ని,హెడ్ రెగ్యులేటర్‌ను మంగళవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుగంగ ఇంజనీర్లతో సమావేశమై జలాశయంలో నీటి నిల్వ, జలాశయంలో ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోవివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి నిల్వను పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జలాశయంలో ప్రస్తుతం 59.730 టీయంసీల నిటి నిల్వ వుందన్నారు. గతంలో 2021లో ఒక్కసారి 61 టీయంసీల నీటిని జలాశయంలో నిల్వ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూడా జలాశయంలో 61 టీయంసీల నీటిని నిల్వ చేస్తామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందు జాగ్రత్తతో రాష్టంలోని అన్ని జలాశయాలలో నిరు నిండుగా వుందని ఆయన తెలిపారు. భారీ వర్షాల ప్రకటనతో నియోజకవర్గంలోని ప్రజలు అప్రమత్తంగా వుండాలని, అలాగే మండల స్థాయి అధికారులు, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వుండి భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈయన వెంట రాపూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, రాపూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు తిక్కమనేని నరసింహ ప్రసాద్, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, ఏదోటి కోటి నాయుడు, నరేష్, తెలుగుగంగ ఇంజనీరింగ్ అధికారులు తదితరులున్నారు.

## రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే



వెంకటాచలం, అక్టోబరు 21, ప్రభాతవార్త: రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలోనే మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు యూరియా కార్డులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ వ్యవసాయ యాంతికరణ పనిముట్లను అందజేయడం జరుగుతుందన్నారు. రైతులెవరు ఆందోళన పడవలసిన అవసరం లేదని, ప్రతి రైతుకు యూరియా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో 23,500 ట్రాక్ట ర్లు రైతు రథం కింద రైతులకు అందజేయడం జరిగిందన్నారు. 13 డ్రోన్లను అందజే శామని ఒక్కొక్కటి 9.80 లక్షలతో 80 సబ్సిడీతో రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఫస్ట్ క్రాఫ్ట్ రైతులకు వీర్యకార్డులను అందజేశారు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైతులందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు.201718 డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్ రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచామన్నారు. ప్రభుత్వ భూమి ఆర్డీవో పట్టా అసైన్మెంట్ శివాయ భూములు కూడా ప్రతి రైతుకు యూరియా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చావటపాళెం సహకార సంస్థ చైర్మన్ రాపూరు రాధాకృష్ణ నాయుడు మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి సర్వేపల్లి డిస్ట్రిబ్యూటీ చైర్మన్ నాగార్జున రెడ్డి, వడ్డెర సంఘం డైరెక్టర్ మునిస్వామి ఎంపీడీవో కల్పన, తాసిల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏఈ హరి కరుణాకర్ రెడ్డి మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నేడు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు,అక్టోబరు21 ప్రభాతవార్త – విద్య జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపద్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు నేడు(బుధవారం) జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో తోపాటూ జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించటం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలాజీరావు, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఓ) వరప్రసాద్‌లు మంగళవారం వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు. విద్యార్థుల తల్లిండ్రులు భారీ వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.